# నిర్ణయం

**— ప్రియదర్శిని**



'ప్చ్' తలుపు తడుతున్నారెవరో! ఇప్పుడు - ఈ సమయంలోనే తట్టాలా! ఊసూరుమంటున్న ప్రాణంతో తెరిచాను. గుమ్మానికటు ప్రక్క ప్రక్కింటి సరోజ.

"అలా వున్నారేం?" గాబర్లాకి ఆప్యాయతని జోడించి ఆడిగిందావిడ.

"ఒంట్లో బావుండ లేదా! లేక ఇంకా పని తెమలలేదా?"

నవ్వాన్నేను దారికడ్డం తొలగి పిలిచా - "రండి!" నాకు తెలుసు ఆవిడ నా ఆహ్వానం కోసం ఏమాత్రం ఎదురు చూడకుండా నరాసరి లోపలికి వచ్చేయగలదని. ఇష్టం లేకపోయినా ఇలా పిలవడమే కనీస మర్యాద పాటించడమా!

కుర్చీలో నిట్టూరుస్తూ కూర్చుని అంది సరోజ "పని త్వరగా తెమలకపోతే నాకసలు తోచదండీ. అన్నీ చక చక అయిపోవాలి!" ఏమనుకుంటుంది ఈవిడ నన్నో నీరసపు మనిషి క్రింద జమకడుతోందా!

"మీలా నాకు ఇల్లు ఇల్లు సర్వే చేయాల్సిన పని లేదు కదండీ" - అనంటే? ఒక్క వు దుటున లేచెళ్ళి - మర్నాటి కల్లా నా చరిత్ర తీరు తెన్నులే మార్చేస్తుందా! అయినా ఈ వీధిలోని ఎవరి ప్రవర్తన తనకు తెలీదు గనుక. రెండేళ్ళ క్రితం వీళ్ళందరి కళ్ళల్లో కనబడిన చులకన భావాన్ని-ఏహ్యాన్ని మర్చిపోతుందా? అదేదో లేచివచ్చిన బాపతన్న భావాన్ని వీళ్ళు ఎంత నిర్భ యంగా వ్యక్తీకరించేవారు! తనెలా సహించిందా అవమా నం? కాలం మార్చడం అంటే ఇదేనా సరోజా - నువ్విలా గంటలతరబడి నాతో కబుర్లు చెబుతూ గడపడమేనా?

"ఏమయింది మీకివ్వాళ" నా ఆలోచనల్కి అడ్డుపుల్ల వేస్తూ అడిగింది సరోజ. ఏం చెప్పను ఈవిడకి? నవ్వాను.

అనవసరంగా తల రుద్దుకొంటూ చెప్పా "మరేం లేదు. ఉదయం నుండీ కాస్త తలనొప్పిగా వుంది. అంతే!" పెదవి విరుపుతో చాలా మామూలన్న భావాన్ని ప్రకటిస్తూ.

"అరరే!" కంగారుగా అంది సరోజ "పోనీ మాత్ర వేసుకోలేకపోయారా. మీవాడెక్కడ? అరరే స్నానం కూడా చేయించినట్టు లేరు. ఏడ్చారా? బుగ్గలమీద కన్పిస్తున్న కన్నీటి చారలను నేను కాదనలేదు. నామౌనం చూసి అందావిడ. "కాఫీ కాచుకోగలరా! లేక నేను తెచ్చి ఇచ్చేదా?" ఇంత ఆప్యాయత - వద్దు సరోజగారు. ఎందుకో తెలీదు గాని నాపెదవులమీదికి మళ్ళీ నవ్వు వచ్చింది. తల అడ్డంగా వూపాను. మరోసారి నావంక చూసాక ఏమను కుందో —

"మరిక వస్తానండీ!" అంది "హమ్మయ్య!" నిట్టూ ర్చింది మనసు. పెదాలు దాటని కృతజ్ఞత నాకళ్ళల్లో కదలాడ్డం ఆవిడ గమనించిందో లేదో!

తలుపులు చేరవేసాను. మరిక ఏం చేయాలి! అనలేం అయ్యింది తనకి. ఉన్నట్టు వుండి ఒక్కసారి బ్రతుకింత నిస్సారం అయ్యిందెందుకో! ఓ తీరు తెన్ను

లేనట్టు జీవితం ఇప్పుడు ఎటువెళుతుంది? అయినా తనేం తప్పు చేసిందని. ప్రేమించిన వాణ్ణీ - ఛఛ ప్రేమించాను అన్న వాణ్ణి పెళ్లాడింది. అంతేగా? తప్పా? అయినా తనేమైనా కావాలని చేసిందా? వయసుకు తోడు కావాలన్న కాంక్షతో చేసిందా? ఊహూ.. పూర్తిగా స్పర్ధలతో వున్న గూట్లో రోజుకోరకంగా మానసికంగా ఛస్తూ - ఓసారి బ్రతకాలనిపించి - కన్నవాళ్ళు తేడవు ట్టిన వాళ్ళు అసలు తన "ఉనికే" పట్టనట్టు ప్రవర్తిస్తు న్నప్పుడు కాసింత ప్రేమ కోసం - గుర్తింపు కోసం వెంపర్లాడింది. దాని పర్యవసానం ఇదా?

తనలో ఏం లోపం వుంది? చదువుకోలేదా? చేతిలో యూనివర్సిటీ వాళ్ళిచ్చిన డిగ్రీ లేదా అది ఉద్యో గానికి పనికి వస్తుందా రాదా అనే ప్రశ్న గతంలో వేసుకొనేది. గతం అంటే మూడేళ్ళకు పూర్వం! అదో అప్పుడే - "నువ్వు నా హృదయానివోయ్! ఇక్కడుండాల్సిన దానివి అలా ఆఫీసుల్లో పడి పని చేస్తాననడం — రియల్లీ ఐ డోంట్ లైకిట్! "ష్! అలా ఆరాతీస్తున్నట్టు చూడకు. నాక్కోపం వస్తుంది. నువ్వేను కొన్నట్టు ఆడదాని సంపా దన అనికాదు నీ ఉద్యోగం మరోవ్యక్తికి - నిజంగా అవసరం వున్న వ్యక్తికి రావడం బావుండదూ! అయినా నా పనికన్నా నీకీ ప్రపంచంతో మరో పని వుంటుంది అన్న వూహే నాకు చిరాకు మైండిట్" అన్నట్టు చూసిన ఆ చూపు - ఆ తీరు - ఇదో ఈ గుండెలోతుల్లో ఇంత భద్రంగా ముద్రించుకుపోయాయి. ఇతడు నాకు దేవు డన్న భావాన్ని కూడా తన దరిదాపులకి రానీకుండా వుంటే— అతనికేం అయ్యింది! భార్యగా తన విధులని నిర్వర్తించలేదా? నెలకో చీరకొనివ్వలేదని - సినిమాలు షికార్లు లేవని - తను ఏనాడైనా వేధించిందా! ప్రతి చర్యలోనూ నువ్వంటే ఇష్టం సుమా అన్న భావాన్ని ప్రతి ఫలిస్తూ - సేవను, ప్రేమను, ఆదరణను అందివ్వ గలిగే స్త్రీని పురుషుడు ఇలా త్యజిస్తున్నాడంటే-? ఓ మనువా? నీ మనుధర్మ శాస్త్రంలో స్త్రీ బాధ్యతను చులకనతో విస్మరిస్తున్న పురుషుని విస్తృత పరచు! "నస్త్రీ స్వాతంత్ర్యమర్హతి" అన్న ఓ పుణ్య పురుషులా రా! మీరు చెప్పండి! మనసా వాచా కర్మణ భర్తకి బందీ అయిన స్త్రీ ఎలాంటి స్వాతంత్ర్యాన్ని వాంఛి స్తుందో! ఉహు.. దిక్కులు పిక్కటిల్లేలా అరచినా తనను ఓదార్చేవాళ్లెవరూ లేరు. ఎవరు చెప్తారతనికి. తను ఎంత వెర్రిగా తన ప్రపంచం నిండా ఇతన్ని నింపుకుందో! "నువ్వు నాకు ఏమీ కావన్న" మాటలని నిష్కర్షగా చెబుతున్న అతణ్ణి చూస్తుంటే తన గుండెలో తుల్ని నృశిస్తున్న అలజడిని ఎవరాపగలరు?

అది కాదు కారణం! తనను అసలతను ప్రేమించి వుండడు. ప్రేమంటే అతడి దృష్టిలో కేవలం సినిమాలు, షికార్లు అన్న భావం వుండి వుంటుంది. తనలా ఓ ఇల్లు కావాలని - అందులో పరస్పర అవగాహనతో జీవించాలని - తనలో వున్న ఈ బలమైన కోర్కె అతనిలో వుండకపోవచ్చు. కానీ, ఇప్పుడెలా! ఈ జీవితపు బండినిలా అర్ధంతరంగా ఆపి ఇలాంటి నికృష్టపు ఆలోచన్లు చేయడం? ఎంతటి విపత్తూ! చిన్నప్పుడు సీత సావిత్రుల కథల్ని చదివినా నామనసు అలా తయారవలేదేం! అతడంత సులభంగా "మా అత్తయ్య కూతుర్ని ఇస్తామంటున్నారు" అనగానే - "మీ సుఖంకన్నా కావాల్సిందేమిటని" వదిలేయ లేకపో యింది. ఎందుకని? పెళ్లన్న దాన్ని గురించి ఇంత బేవార్సుగా ఆలోచిస్తున్నారు జనాలు. ఎంత పెళ్ళి కావా ల్సిన అమ్మాయి వుంటే మాత్రం ఇంత దిగజారి పోయి-అతడి జీవితం మరో అమ్మాయి జీవితంతో ముడి పడిపోయిందని తెలిసీ కూతుర్నిస్తామంటున్నారు. పైగా కట్నంట! ఇంతకన్నా మేలైన మగాడు దొరకడ న్నట్టు! డబ్బుతో ఇలా కొనేస్తామనగానే ఆనందంగా అమ్ముడవుతున్న ఈతన్ని పోనీ ఆ డబ్బు నేనిస్తాను వుండిపో అనంటే? తన దగ్గర అంత డబ్బు ఎక్కడిది? అయినా మనిద్దరం ఓ ఇంటివాళ్ళం అయ్యాం కదా మరి నువ్వు నన్నిలా వదిలేసి - ఛ ఆ మాత్రం అవగాహనత లేదా అతనికి? పోనీ - మన బాంధవ్యానికి ప్రతిరూపం అయిన ఆ పసివాణ్ణి చూడు అంటే - మరో భయంకరమైన ప్రశ్నతో తన మనస్సుని చీల్చ వచ్చు. మగాడిలా ప్రవర్తించడానికి సిగ్గుపడడా? ఏమో-కానీ తనకే ఎలా! అమ్మానాన్నల దగ్గర ఆశ్రయం దొరకదు. ఇతనికి తన అవసరం లేదుట. మరిక సమాజం! తన వంతు బాధ్యతగా ఈమెను భర్త వదిలేసాడని - ఈ చదువు కొన్న వాళ్ళతీరు ఇంత - తొందరపడి ఇలా పెళ్ళి చేసుకొంటే ఇలాంటి శాస్తి జరగాల్సిందే! అన్న తీర్మానమూ చెబుతుంది! అసలు ఈ సమాజవైఖరి మారిపోతుంది తన పట్ల! నిజంగా తను అంత నేరం చేసిందా!

పోనీ-ఉద్యోగం దొరికితే బావుణ్ను. దొరికేంత వరకూ, ఎక్కడుంటుంది. తనకు నీడేది. మేం వున్నాం అన్న వాళ్ళు ఒక్కరూ లేరు. సుఖసంతోషాలకి కేంద్రం ఏదో తెలీదు గానీ - బాధలకన్నింటికి ఒంటరితనం మూలం అన్పిస్తుంది.

ప్చ్! కథల్లోనూ - నవలల్లోనూ చదివినట్లు తనకు ఒక్క స్నేహితురాలు లేదు ఆదుకోడానికి! అందులో విచిత్రం ఏమీ లేదు. ఆమధ్యకాలంలో తెలిసిన వాళ్ళు

---

దాదాపు ఆరేళ్ళ క్రితం ఈ కారణంగా అసువులు బాసిన "అమృత" తాలుకు స్మృతులు ఈ కథకి ప్రేరణ. ఆమె ఆత్మకు శాంతి చేకూరుతుందో లేదో నేనూహించ లేను. గానీ — కథానాయిక నిర్ణయం వెనుక దాగున్న వ్యధను గుర్తించి ఒక్కరైనా సరైన నిర్ణయం తీసుకోక పోతారా అన్న ఆశతో రాశానీ కథ. ఈ రకమైన సమస్య ఎదురైన స్త్రీలు ఈ ముగింపును ఆదర్శంగా తీసుకోక — స్థయిర్యంతో మెలగాలన్నది నా ఆకాంక్ష. సహజత్వం కోసం రాయబడిన ముగింపు నచ్చని పాఠకులను క్షమించమని కోరుతూ.

— రచయిత్రి

---

మొహం తప్పుకోకుండా పలకరింపుగా నవ్వడమే చిత్రంగా తోచేది తనకి!

గోడగడియారం టింగు మంది. ఒంటిగంట! ఆ గడియారం మా పతిదేవులుంగారు తెచ్చి చేసిన హడావిడి వర్ణించలేను గానీ - మొన్న మొన్నటి వరకూ - ఆ గడియారం ముల్లుతో పాటు నాకళ్ళు పరుగెట్టేవి! టింగు మనేదాలస్యం తలుపు తెరచి సాదరమైన ఆహ్వానం పలికేందుకు - భౌతికంగా మానసికంగా నన్నొద్దు రాలిన య్యేదాన్ని! ఇప్పుడో! అదో తలుపు శబ్దం!

అతను లోపలికొస్తూనే లాఠీ చరిచి మాటాడే పోలీసులా అడిగేడు. "ఏమిటీ అవతారం? హంగర్ స్ట్రైక్ చేస్తున్నావా? లేక నా చేత చేయిస్తావా?" భార్యతో ఇంత క్లాసిగ్గా జోకు వేయడం నీకే చెల్లింది మహాను భావా! నా మనసు మూల్గింది.

"మాకు తిండీ గిండీ ఏమీ లేదా? ప్రొద్దున్నే చెబితే ఏ హొటల్లోనో భోంచేసే వాళ్ళం కదా!" రెండో మాటకే చిరాకు రంగ ప్రవేశం చేసింది. నేను ఎప్పటిలా నవ్వు విసిరి "రండి" అని ఆహ్వానించలేదు. నా మౌనం అతన్ని మరింత రెచ్చగొట్టింది. "ఏమిటిన్ని మాటలంటు న్నా మాట్లాడవేం? వాడిష్టం - వెళ్ళిపోతాడనా!"

ఉహూ తమరి పాదపూజ ఎలా చేయాలా అని ఆలోచిస్తున్నాను. అందుకు అంగీకరించని నా మనసుని చివాట్లేస్తున్నాను. మనసులోని వ్యంగ్యం మాటల రూపంలో సంధించకుండా పిలిచాను,

"రండి వడ్డిస్తాను".

భోజనం చేస్తూ అన్నాడతను. "ఇలా మౌనంగా వుంటే నేను మారిపోయి - తప్పయింది అదంతా మర్చిపో ఇవి చేతులు కావు కాళ్ళనుకో అని బ్రతి మాలతాననుకున్నావా? నెవర్".

సూటిగా అతనికేసి చూసాను. అత్యంత సున్నిత భావాల్ని ప్రకటించేందుకు భాష ఎలా చాలదో - ఈ మూర్ఖశిఖామణి ముందు నా ఛీత్కారాన్ని వెల్ల డించేందుకు భాషనుపయోగించడం భాషను అవమా నం చేయడమే!

"అలా చూడకు. నాక్కోపం" తుండుతో చేయి తుడు చుకొని వెళ్లిపోతూ అన్నాడతను.

అయితే? కోపం - ద్వేషం, ఛీత్కారం - నువ్వు నన్ను ప్రేమించి పెళ్ళాడావు - జీవితాంత సహచరుడిలా వుంటావన్న నమ్మకంతో వున్న నా ఆశలు సమాధి అయిపోయిన నాకో-నాకు మాత్రం కోపం లేదా?

....

—మీకే ఉన్నపళంగా మిమ్మల్ని మూడేళ్ళ వెనక్కి లాక్కెళ్ళి "యూ ఆర్ మై హార్ట్ మెన్!" అందుకే ఏదైనా ఇలా మొహం మీద అడిగేస్తాను అన్న మాటల్ని — "నామీద నమ్మకం వుందా లేదా!" అని నిలదీసిన ఆ తీరుకి — అప్పట్లో ఇతడు నా మీద ఈగని కూడా వాలనివ్వ డనిపించింది. అదే ఆ పొజెసివ్ నెస్ ను నమ్మడం వల్ల — మీ భార్యనై - ఇదో ఈ దశకి చేరుకొన్నాను. మన పరిచయం నుండి ఈ నాటి వరకు మన మధ్య జరిగిన ప్రతి సన్నివేశము, సంభాషణా - నా మనసులో పొరలు పొరలుగా ఏర్పడి - చూడు - చూడని - నా మనసుని కదిపేస్తున్నాయి.

"చాల్లే!" అన్న ఒక్కమాటతో మీరు కొట్టి వేస్తారు. మీకు గతం కన్నా ప్రస్తుతం బావుంది. ప్రస్తుతం కన్నా రేపు ఆ అమ్మాయి - తద్వారా వచ్చే కట్నం బావుంటా యి. ఆ రకంగా మీ వాళ్ళందరిలో మీరు కలిసి పోవడం ఇంకా బావుంటుంది. నేను, నా చరిత్ర చివరి పేజీని కూడా చదివేసారు. తిరగేయనవసరం మీకు లేదు. కానీ - జీవితం తొలి పేజీని బ్లాంక్‌గా చూస్తున్న అనుభూతి విహ్వలం చేస్తోంది నన్ను. నిజం చెప్పాలంటే నాక్కోపం గాను, కసిగానూ వుంది. నా ఈ ఉక్రోషాన్ని ఎవరి మీద చూపించాలి? తల్లిదండ్రులు, భర్త, సమాజం, నన్ను దరి చేరినట్టు చేరి దూరం జరిగి నన్ను ఒంటరిని చేసాయి. నేను ఎందుకు ఒంటరి నయ్యాను!

బ్రతుకు మీద ప్రీతి లేక పోవడం కాదు. కానీ నిస్సారంగా ఏ అనుభూతికీ లోనుకాకుండా బ్రతకడం ఇష్టం లేదు. సమాన హక్కులనీ, చట్టం కోర్టు - వాదనలు - ఇవేవి నాకిష్టం లేదు. వివాహం ద్వారా ఇద్దరు వ్యక్తులు ఒకరికొకరు ప్రేమాప్యాయతలు, సుఖదుఃఖాలు, గౌరవ మర్యాదలు - రక్షణ కల్పించు కోవాలి. కానీ వీటిని ఇవ్వలేమంటున్న వాళ్ళనుండి చట్టం సాయంతో పొందాలనుకోవడం నాకెంతో అవ మానంలా తోస్తుంది. నిజంగా దేవిరించడం అవుతుందే మో! మనసులు కలవకుండా ఇద్దరి జీవితాలని కోర్టు తీర్పు బంధించగలదో లేదో నాకు తెలీదు. కానీ నా భారాన్ని వహించలేనని - రక్షణనివ్వ లేనని తన

అనమర్థతని స్వయంగా ఒప్పుకొంటున్న మీ అసహాయ తకి సిగ్గేసి ఈ నిర్ణయం తీసుకుంటున్నాను. ఓ స్త్రీకి భర్త అయి - ఆమె సంరక్షణ బాధ్యతని సరిగ్గా నిర్వర్తించలేని పురుషుడు సిగ్గుపడాల్సింది పోయి - మరో వివాహానికి సిద్ధపడుతున్నందుకు - అతడి అసమ ర్థతకి తలవంచి తమకూతుర్నే బలియిస్తున్న తల్లి దండ్రుల నిస్సహాయస్థితి, - సిగ్గు అసహ్యం కల్గుతు న్నాయి. మరీ ఇంత హీనస్థితికి దిగజారి పోతున్నా మెందుకు! మన సభ్యత సంస్కారాలు ఇవేనా?

ఏమో — వాటిని గురించి నేను తర్కించలేను. నా పరిజ్ఞానం చాలా తక్కువ. కానీ జీవితం — విశాల విశ్వంలో నేను బ్రతకలేనని కాదు. కానీ పరిస్థితులు మరింత దిగజారితే - ఈ స్థితిలో గుండె తట్టుకోలేదు. వంటరిననే ఈ వ్యథ నన్ను నిలవనీయడం లేదు. నాకు జరిగిన అన్యాయాన్ని జరగాల్సిన జీవన న్యాయా నికి నేనెవరిని అర్థించాలో అంతు పట్టడం లేదు. మనుషులు తమ స్వసుఖం కోసం ఇతర్లని ఇంతలా మభ్యపెట్టి - త్యజించడాన్ని - స్వానుభవంతో తెలుసు కొన్న నేను ఈ ప్రపంచంలో ఇమడ లేను. ఈ బాధని నేను భరించలేకుండా వున్నాను.

నన్ను మరింత కృంగదీస్తున్నది బాబు విషయం. ఈ పరిస్థితిల్లో వాడి గురించి ఆలోచించి - నన్ను నేను నిలద్రొక్కుకోవాలనుకొన్నా చేయలేక పోతున్నాను. ప్చ్! తల్లిదండ్రుల నుండి ప్రేమను ఆదరాన్ని పొందా ల్సిన వాడు! పురిటికళ్ళు తెరవకుండానే రోడ్డు వారగానో - చెత్తకుండీల్లోకో విసిరివేయబడుతున్న వాళ్ళకన్నా కాస్త ఆలస్యంగా ప్రపంచానికి వాడు అనాథగా పరిచ యం అవుతాడు. తల్లినై వాడి బాధ్యతని నేను విస్మ రించినట్టుగా మీరూ విస్మరిస్తే! భగవంతుడున్నాడో లేడో! వుంటే మాత్రం నాదొక్కటే విన్నపం! మరో జన్మలోనూ మీ భార్యనవ్వాలని గానీ - ఈ జన్మ అను భవంతో అసలు స్త్రీ జన్మే వద్దని కానీ అడగను. కానీ స్త్రీకి "మాతృత్వం" అనే అపూర్వ వరాన్ని ప్రసాదించిన దేముడా! తన రక్తాన్ని పాలగా మారుస్తున్న స్త్రీ చను పాలల్లో వుండే వివిధ పోషక పదార్థాలతో పాటు కాసింత సంస్కారాన్ని కూడా మిళింతం చేయి! నీ సృష్టికి అప్పుడు కాస్త అందం వస్తుంది. మనుషుల అంతరాలు మరీ ఇంత మలినం కావన్నది నాకున్న చిరు ఆశ!

ఇహ - మీకు చెప్పాల్సినవి - చెప్పుకోవాల్సినవి ఏమీలేవు. ఇంతకాలం మీకు భార్యగా ఎలా మెదిలా నన్న ప్రశ్న మాత్రం నన్ను వేధిస్తోంది. ఈ వేదనలోనూ

— నేను

ఇంత సుదీర్ఘమైన ఉత్తరం రాసినా కన్నీళ్లు రావేం! దిక్కులు పిక్కటిల్లేలా అరవాలన్న కాంక్ష కూడా గుండె లోతుల్లో అంతరించి పోతోందెందుకు. బహుశా - మనసు బీటలు వారడం అంటే ఇదేనేమో ! ఇది చదివి అతడేం అనుకొంటాడు. సంతోషించ వచ్చు. ఈ బీరకాయ పీచు సంబంధం ఇంత తేలిగ్గా వదిలిపోయి నందుకు రిలీఫ్‌గా ఫీలవ వచ్చు. లోకం ముందు నాపై ప్రేమని దుఃఖం రూపంలో ప్రకటించవచ్చు. ప్చ్! మనసింత భీషణ సంగ్రామం జరిపాక — ఈ సీసాలోని ద్రవం సేదదీర్చబోతుంది. దీన్ని తయారు చేసిన కంపె నీవాడు మరీ కక్కుర్తి పరుడు కాకుండా — ఇది కల్తీ లేని విషం అయితే - ఈ ఘర్షణ - తాపత్రయాలకి ఇహ.....

---


రచయిత్రి చిరునామా
ప్రియదర్శిని
10-197
మేడ్చెల్ - 501 401.



# వనిత

## జన్మదిన సంచిక నవలల పోటీ

## మొదటి బహుమతి రూ. 5,000
## రెండవ బహుమతి రూ. 3,000

నవలల పోటీ

* 'వనిత జన్మదిన సంచిక' (జూలై '88)కి నవలల పోటీని నిర్వహిస్తున్నది. ఈ నవలల పోటీలో పాత, కొత్త రచయిత్రులందరూ పాల్గొనవచ్చును.
* పై రెండు స్థానాలలో ఎన్నికైన నవలకు పైన ప్రకటించిన ప్రకారం బహుమతులు ధనరూపంలో చెక్కు ద్వారా గెలుపొందిన వారికి అందుతాయి.
* పై రెండే కాకుండా, పోటీకి వచ్చిన తక్కిన వాటిల్లో కూడా బాగున్న నవలలు ఏవైనా వున్నట్లయితే – వాటిని సాధారణ ప్రచురణకు స్వీకరించి ఆ రచయిత్రులకు తగిన పారితోషికం అందజేస్తాము.

పాటించవలసిన చిన్న నిబంధనలు

1. సమకాలీన సమాజానికి సంబంధించిన ఎలాంటి సమస్యనైనా సరే ఇతివృత్తంగా తీసుకుని – నవలా రచన జరగాలి.
2. లిఖిత ప్రతి అర తావు (ఫుల్‌స్కేప్) సైజులో 180 పేజీలకు తగ్గకుండానూ, 200 పేజీలకు మించకుండానూ వుండాలి.
3. లిఖిత ప్రతిలో కొట్టివేతలూ, దిద్దుబాట్లూ లేకుండా, గజిబిజి రాత కాకుండా, శుభ్రంగా తెలిసేలా వుండాలి. పేజీకి ఒక వక్కనే, సిరాతో రాయాలి. రచన వాడుక భాషలోనే సాగాలి.
4. నవల ఏ తెలుగు రచనకు గాని, ఇతర భాషారచనకు గాని — అనుకరణ గాని, అనువాదం గాని కాదని — పూర్తిగా సొంతంగా రాసినదేనని, ఇది వరలో ఏ రూపంలోనూ ఎప్పుడూ, ఎక్కడా ప్రచురణగానీ, ప్రసారం గానీ కాలేదనీ — హామీపత్రం రాసి, సంతకం చేసి — నవలతోపాటు జత చెయ్యాలి.
5. ప్రచురణకు స్వీకరింపబడే నవలలోని భాగాలను అవసరమైతే — ఎక్కడైనా తొలగించడానికిగాని, తగ్గించడానికిగాని — 'వనిత' సంపాదక వర్గానికి హక్కు వుంటుంది.
6. స్వీకరింపబడిన రచనలు 'వనిత'లో సశేష నవలలుగా ప్రచురింపబడతాయి. నవలమీద — ఈ ప్రచురణ హక్కు తప్ప, ఇంకెలాటి హక్కులూ 'వనిత'కు వుండవు. 'వనిత'లో ఆ నవల పూర్తిగా ప్రచురణ అయిన తర్వాత నవలకు సంబంధించిన తక్కిన హక్కులన్నీ రచయిత్రివే.

గడువు పొడిగింపు

నవలలు చేరవలసిన ఆఖరి తేదీ: మే 10, '89

☐ స్వీకరింపబడని నవలను రిజిష్టర్డ్ పోస్టులో తిప్పి పంపడానికి తగినన్ని స్టాంపులు నవలతోపాటే పంపాలి.

మొదటి బహుమతి పొందిన నవల జూలై '89 'జన్మదిన సంచిక'లో ఆరంభమవుతుంది.